www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 83 | 6-9-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## పోలీసులకే సవాల్..

- సీజేపీ నిరసనల ఘటనలో ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్
- దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు
- బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య
- ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్
- కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ



.. వివరాలు 4లో

## బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన




4

## లష్కర్ కమాండర్ హతం

- భద్రతా దళాల మెరుపు దాడి
- బద్గాంలో సంయుక్త ఆపరేషన్



4

జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్ పర్వత ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా దళాలు జరిపిన మెరుపు ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన కీలక పాకిస్థానీ కమాండర్ 'యాసిర్' హతమయ్యాడు.



## రెండేళ్లలో టీచర్ల సమస్యలన్నీ

# పరిష్కరిస్తా

### విద్యారంగ రూపురేఖలు మార్చేస్తా

- ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- అనేక సంస్కరణలు, మార్పులు తేస్తున్నాం
- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ
- కొడంగల్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2

## 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్

- దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్
- హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి
- గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సీఎం రేవంత్



2




## కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

- వెయ్యి రోజుల మోసానికి రేవంతే తప్పుకోవాలి: కేటీఆర్
- 420 హామీలకు 420 సార్లు రాజీనామా చేయాలని ఎద్దేవా
- నిరుద్యోగులను నిండా ముంచారని కాంగ్రెస్‌పై ధ్వజం
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక
- కరీంనగర్ యువ సమరభేరిలో తీవ్ర విమర్శలు

**కరీంనగర్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** "తెలంగాణ సాధించిన కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి? వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే రాజీనామా చేయాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలకు ఆ పార్టీ నాయకులు 420 సార్లు రాజీనామా చేయాలని ఎద్దేవా చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన

మిగతా 3 లో

## సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

- ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం
- కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?
- సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా
- సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు
- వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు
- ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు
- ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?
- ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- కిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

2

'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు.

## భారీగా పెరగనున్న ఆటో చార్జీలు!



- బేసిక్ చార్జీగా రూ.30 నిర్ణయం
- ప్రభుత్వం ఆమోదమే తరువాయి..

2

తెలంగాణలో ఆటో చార్జీల పెంపునకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి నేతృత్వంలోని అధికారుల కమిటీ తయారుచేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు చేరాయి. ప్రభుత్వం ఈ సిఫార్సులకు లాంఛనంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త చార్జీల అమలుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.



## దొరకని ఆయుధాలు.. దొంగల జాడేదీ?

- నాలుగు రోజులైనా చిక్కని కీలక ఆధారాలు
- రంగంలోకి దిగిన జాతీయ దర్యాప్తు సంస్థ
- జవాన్లు, మాజీ సిబ్బందిపై విస్తృత విచారణ
- రాత్రి పనిచేయనిసీసీకెమెరాలపై అనుమానాలు
- ఆయుధాల లెక్కల్లో వ్యత్యాసాలపైనా ఆరా

2

## '22ఏ' పేరుతో భూదందా!

- ప్రజల భూములు లాక్కునే కుట్ర: రాంచందర్‌రావు
- కేసీఆర్ బాటలోనే రేవంత్ సర్కార్
- బాధిత భూములపై వెంటనే సమీక్షకు డిమాండ్
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం

3



## రేపటి నుంచి అసెంబ్లీ

- ఉభయ సభల సమావేశాలకు సర్వం సిద్ధం
- ప్రశాంత వాతావరణం ఉండేలా పటిష్ఠ చర్యలు
- సభ్యుల ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు
- మూడు భాషల్లో సభా సమాచారానికి ఆదేశం
- కీలక బిల్లులు.. ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఉద్యమ కెరటం):** అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా

మిగతా 3 లో



## శతాబ్దం దాటినా..

### విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖి
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ

4

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# భారీగా పెరగనున్న ఆటో చార్జీలు

## బేసిక్ చార్జీ రూ. 30కి పెంపునకు సిఫార్సు

## ప్రభుత్వ ఆమోదమే తరువాయి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో ఆటో చార్జీల పెంపునకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి నేతృత్వంలోని అధికారుల కమిటీ తయారుచేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు చేరాయి. ప్రభుత్వం ఈ సిఫార్సులకు లాంఛనంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త చార్జీల అమలుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం, ఆటోలకు కనీస చార్జీగా తొలి 1.6 కిలోమీటర్ల దూరానికి రూ.30, ఆ తర్వాతి ప్రతి కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయాలని ప్రతిపాదించారు. అలాగే, ట్రాఫిక్ లేదా ప్రయాణికుల కోసం వెయిటింగ్ సమయానికి నిమిషానికి 75 పైసలు, రాత్రి వేళల్లో (నైట్ చార్జీలు) సాధారణ చార్జీ కంటే 50 శాతం అదనంగా అమలు చేయాలని సిఫార్సు చేశారు. తెలంగాణ ఆటో, క్యాబ్ జేఏసీ యూనియన్లు తమ 14 ప్రధాన డిమాండ్లపై నిర్వహించిన నిరసనల అనంతరం, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకే ఈ అధ్యయనం చేపట్టారు. డీటీసీ సురేశ్ రెడ్డి, ఎంవీఐ శ్రీనివాస్ బృందం ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, కేరళలోని చార్జీలను పరిశీలించి ఈ నివేదిక ఇచ్చింది. రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా ఆటో చార్జీలను సవరించలేదని, ఈ కాలంలో ఇంధన ధరలతో పాటు ఇన్సూరెన్స్, విడిభాగాలు, నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయని తెలిపింది. ఆటో కొనుగోలు వ్యయం, రుణాలు, డ్రైవర్ల జీతాలు, ప్రతి కిలోమీటరుకు రూ.13.53 అయ్యే నిర్వహణ వ్యయాన్ని ప్రామాణికంగా తీసుకుని ప్రతి కిలోమీటరుకు రూ.14గా నిర్ణయించాలని సూచించింది. మంత్రివర్గ ఆమోదం ముద్ర పడగానే రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా కొత్త మీటర్ చార్జీలు అమల్లోకి రానున్నాయి.

# దొరకని ఆయుధాలు.. దొంగల జాడేదీ?

## నాలుగు రోజులైనా చిక్కని కీలక ఆధారాలు

## రాత్రివేళ పనిచేయని సీసీ కెమెరాలపై అనుమానాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆర్మీ రెజిమెంట్ ఆయుధాగారం నుంచి అధునాతన ఆయుధాలు మాయమైన ఘటనలో నాలుగు రోజులు గడిచినా మిస్టరీ వీడటం లేదు. ఆయుధాలను ఎవరు అపహరించారు? ఎక్కడికి తరలించారు? అన్న కీలక ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు. జాతీయ భద్రతతో ముడిపడిన వ్యవహారం కావడంతో కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించినట్లు సమాచారం. దీంతో ఎన్ఐఏ అధికారులు రంగంలోకి దిగి దర్యాప్తును ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులతో పాటు మిలిటరీ ఇంటెలిజెన్స్, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులు ఇప్పటికే విస్తృతంగా విచారణ చేపట్టారు. రెజిమెంట్‌లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న జవాన్లతో పాటు గతంలో అక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన సిబ్బందినీ ప్రత్యేక బృందాలు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అనుమానితుల ఫోన్ కాల్ సమాచారం, కదలికలను విశ్లేషించినప్పటికీ నిందితులను గుర్తించే కీలక ఆధారాలు ఇప్పటివరకు లభించలేదని సమాచారం. దర్యాప్తులో వెలుగుచూస్తున్న భద్రతా లోపాలు అధికారులను కలవరపెడుతున్నాయి. ఆయుధాలు నిల్వ చేసే అత్యంత కీలకమైన 'కోట' ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంతకాలంగా ప్రతిరోజూ రాత్రి 10.30 గంటల తర్వాత పనిచేయడం లేదని విచారణలో గుర్తించినట్లు సమాచారం. తిరిగి ఉదయం 7 గంటల సమయంలోనే అవి పనిచేస్తున్నట్లు తేలిందని తెలుస్తోంది. సీసీ కెమెరాల నిలిపివేతకు సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఆదేశాలు లేవన్న అంశంపైనా అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. రాత్రివేళల్లోనే భద్రతా నిఘా అత్యంత కీలకంగా ఉండగా.. అదే సమయంలో కెమెరాలు పనిచేయకపోవడం వెనుక సాంకేతిక సమస్య ఉందా? ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారా? లోపలి వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. ఆయుధాగారం నిర్వహణకు సంబంధించిన రికార్డులపైనా దర్యాప్తు బృందాలు దృష్టి పెట్టాయి. ఘటనకు సుమారు 15 రోజుల ముందు నుంచే ఆయుధాలు, మందుగుండు సామగ్రికి సంబంధించిన రిజిస్టర్లలో లెక్కల వ్యత్యాసాలు ఉన్నట్లు అంతర్గత పరిశీలనలో గుర్తించినట్లు సమాచారం. రోజువారీ లెక్కల నమోదులో తేడాలు, సీసీ కెమెరాల పనితీరు మధ్య ఏదైనా సంబంధం ఉందా అన్న కోణంలోనూ సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భద్రతా వర్గాలను కలవరపెడుతున్న ప్రధాన అంశం చోరీకి గురైన ఆయుధాల ఆచూకీ. అవి ఎక్కడికి చేరాయి? ఎవరి చేతుల్లో ఉన్నాయి? చోరీ వెనుక ఉద్దేశం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడమే దర్యాప్తులో కీలకంగా మారింది. అధునాతన ఆయుధాలు నేరగాళ్లు లేదా ఉగ్రవాదుల చేతుల్లోకి చేరితే తీవ్ర భద్రతా ముప్పు ఏర్పడే అవకాశం ఉండటంతో వీలైనంత త్వరగా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఆయుధాల చోరీ వెనుక బయటి వ్యక్తుల హస్తం ఉందా.. లేక 'ఇంటి దొంగల' పాత్ర ఉందా అన్నదే ఇప్పుడు దర్యాప్తులో కీలకంగా మారింది.



# రెండేళ్లలో టీచర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తా

- విద్యారంగ రూపురేఖలనుమార్చేస్తా
- ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- అనేక సంస్కరణలు, మార్పులు తేస్తున్నాం
- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశాం
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేదు
- కోడంగల్ పర్యటనలో రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో విద్యారంగ రూపురేఖలను మార్చేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, విద్యాశాఖలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని, తనకు రెండేళ్ల సమయం ఇస్తే అన్ని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులతో సమానంగా సమాజంలో పిల్లల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. గత పాలకుల హయాంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో పడివున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిత్తశుద్ధితో పూర్తి చేసిందని గుర్తుచేశారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ఎక్కడా ఎలాంటి లోపాలు, అభ్యంతరాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. "రాష్ట్రంలో కొత్తగా 88 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. అందుకే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నా బాధ్యత. సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యాశాఖ కమిషన్ ద్వారా దశాబ్దాలుగా పేరుకుపోయిన ఎన్నో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ సమస్యను కూడా పరిష్కరించాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వానికి ఎంతో గౌరవం ఉందని చెబుతూ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇటీవల హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించడం నన్ను ఎంతో బాధించింది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పుడు రోడ్డెక్కడం తగదు. చర్చల ద్వారానే పరిష్కారం దొరుకుతుంది" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. గత జ్ఞాపకాలు, విద్యా ప్రగతిని ప్రతిబింబించే చిత్రాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ బోధనారంగంలో మరింత అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. పాలిటెక్నిక్ విద్యా విధానంలో ఎలాంటి మార్పులు చేయట్లేదని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విషయంలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఉపాధ్యాయులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారన్న రేవంత్? రెడ్డి, అలాంటి వారి ట్రాప్?లో పడొద్దని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు మనమంతా పునరంకితమవుదామని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి, ఉపాధ్యాయుల బాధ్యత తాను చూసుకుంటానని, విద్యార్థుల బాధ్యత టీచర్లు చూసుకోవాలని సూచించారు. అంతకుముందు కొడంగల్ నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. తెలంగాణలో ఓట్లను తొలగించి దొంగ దెబ్బ తీయాలనుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారన్న ముఖ్యమంత్రి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను బీజేపీ టార్గెట్ చేసిందన్నారు. గతంలో ఎన్నికల్లో ఓడించేందుకు ఈడీ, సీబీఐ ఉపయోగించేవారన్నారు. కాంగ్రెస్‌ను ఓడించే కుట్రకు బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతు ఇస్తోందన్న రేవంత్ రెడ్డి, అందరూ అప్రమత్తంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

## దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

## హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

## గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం

## దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ డేటా సెంటర్ సామర్థ్యం గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది. టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

## ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం

## కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?

## సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా

## సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు

## వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు

## ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు

## ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?

## ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం

## కిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

## వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్?ఎస్ అధినేత కేసీఆర్?కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

మొదటి పేజీ తరువాయి



'యువ సమరభేరి'లో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు రుణాలు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. "2006లో కూడా ఇదే కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్‌ను రాజీనామా చేయాలని సవాల్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్తే ఏం జరిగిందో గుర్తు చేసుకోవాలి. అప్పుడు కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి సమాధానం చెప్పారు" అని పేర్కొన్నారు. కేసీఆర్‌తో రాజకీయంగా తలపడితే రేవంత్‌రెడ్డికి అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. "ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. పోరాటాలకు పురిటిగడ్డ కరీంనగర్ అని, ఇక్కడి నుంచే కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి కీలక మలుపు ఇచ్చారని గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని కేటీఆర్ ఆరోపించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. యూత్ కమిషన్, ప్రైవేటు సంస్థల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు, కళాశాల విద్యార్థినులకు స్కూటీలు, యువతకు రూ.10 లక్షల రుణాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు ఎక్కడిదాకా వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. "అప్పుడు యూత్ డిక్లరేషన్ అంటూ యువతకు ఆశలు కల్పించారు. ఇప్పుడు హామీల గురించి అడిగితే ఎదురుదాడి చేస్తున్నారు" అని విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన కేటీఆర్.. "నోటిఫికేషన్ లేదు.. లూటిఫికేషన్ మాత్రం నడుస్తోంది. జాబ్ క్యాలెండర్ లేదు.. స్కామ్ క్యాలెండర్ నడుస్తోంది" అంటూ ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలో విజన్ లేదని, విధ్వంసమే కనిపిస్తోందని విమర్శించారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల తర్వాత యువత సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై కూడా కేటీఆర్ పలు తీవ్ర ఆరోపణలు చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు అధికారం అప్పగించారని, కానీ అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. యువత పిడికిలి బిగిస్తే ఎంతటి ప్రభుత్వమైనా దిగిరావాల్సిందేనని కేటీఆర్ అన్నారు. "వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి. కేసీఆర్‌ను రాజీనామా చేయమనడం కాదు.. ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు లెక్క చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

# రేపటి నుంచి అసెంబ్లీ సమరం

మొదటి పేజీ తరువాయి



అందించడంతో పాటు సమావేశాల సమయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. సమావేశాల నిర్వహణ, సభ్యులకు వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గత సమావేశాల కంటే మరింత వేగంగా, సమన్వయంతో అధికారులు పనిచేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ఈసారి సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాలు జరిగే సమయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సభ్యులకు అవసరమైన సమాచారాన్ని తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని స్పీకర్, ఛైర్మన్ ఆదేశించారు. ధర్నాలు, రాస్తారోకోలు తదితర ఆందోళనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నిఘా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అసెంబ్లీ అధికారులకు చేరవేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలని పేర్కొన్నారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందుగానే అందించాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉభయ సభల సమావేశాల నిర్వహణ ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనంగా నిలవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాల నిర్వహణకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీలు, పాలనాపరమైన అంశాలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు విపక్షాలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. దీంతో ఈసారి ఉభయ సభల్లో అధికార, విపక్షాల మధ్య వాడీవేడి చర్చలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ఎన్ని రోజులపాటు కొనసాగాలన్నది బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఖరారు కానుంది.

# '22ఏ' పేరుతో భూదందా!

**ప్రజల భూములు లాక్కునే కుట్ర: రాంచందర్‌రావు**

**కేసీఆర్ బాటలోనే రేవంత్ సర్కార్**

**హైడ్రా, క్యూర్‌తో ప్రజల్లో భయాందోళనలు**

**బాధిత భూములపై వెంటనే సమీక్షకు డిమాండ్**

**న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రజల భూముల జోలికి వెళ్లిన ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన మహాధర్నాలో రాంచందర్‌రావు పాల్గొని మాట్లాడారు. 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల భూములపై ప్రభుత్వం వెంటనే సమీక్ష చేపట్టి, అర్హమైన వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా రాంచందర్‌రావు విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి' పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసి చివరకు అధికారాన్ని కోల్పోయిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తన గోతిని తానే తవ్వుకుంటోందని వ్యాఖ్యానించారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో 30 శాతం కమీషన్ల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సొంత భూములపై అనిశ్చితి సృష్టించడం సరికాదని రాంచందర్‌రావు అన్నారు. 22ఏ జాబితాలో చేరిన భూములను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి, అన్యాయంగా నమోదైన వాటిని వెంటనే తొలగించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బీజేపీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. "ప్రజల భూములపై కన్నేసిన పాలకులు చరిత్రలో బాగుపడలేదు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుంది" అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

# 'రైతులను మళ్లీ రోడ్డెక్కించారు!'

**కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంట్**

**మాజీ మంత్రి హరీష్‌రావు**

**ఇప్పుడు విద్యుత్, యూరియా కోసం రైతుల పాట్లు**

**రైతుబంధులో 29 వేల కోట్లు ఎగ్గొట్టారని ఆరోపణ**

**ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్**




**దుబ్బాక, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** "మా తెలంగాణ మాకు కావాలని నాడు రోడ్లపై వంటావార్పు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో రైతులు ప్రశాంతంగా ఉన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో మళ్లీ రైతులు వంటావార్పులతో రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి వచ్చింది" అని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. తాము కొత్తగా గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, యూరియా, ధాన్యం కొనుగోలు, సాగునీరు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించామని హరీష్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు ఎనిమిది గంటలు కూడా సక్రమంగా విద్యుత్ రావడం లేదని రైతులు ఫోన్లు చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే తాము రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చెప్పిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న సాయాన్నే పూర్తిస్థాయిలో అందించడం లేదని హరీష్‌రావు ఆరోపించారు. మూడేళ్లలో రైతులకు రావాల్సిన రైతుబంధులో రూ.29 వేల కోట్లు ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీఏపీ ధరలను భారీగా పెంచిందని విమర్శిస్తూనే.. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ల విధానంతో రైతులకు మరిన్ని ఇబ్బందులు తెచ్చిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు బస్తాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని హరీష్‌రావు ఆరోపించారు. తరుగు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గతంలో చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు సహా అన్ని వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హరీష్‌రావు ఆరోపించారు. పెన్షన్ల పెంపు, కల్యాణలక్ష్మితో తులం బంగారం తదితర ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. "కరెంట్, రైతుబంధు, రైతుబీమా.. ఇవన్నీ మళ్లీ పక్కాగా అందాలంటే కేసీఆర్ నాయకత్వం రావాలి. కాంగ్రెస్ చేసిన మోసాలకు రైతులు, మహిళలు ఓటుతో సమాధానం చెప్పే సమయం వస్తుంది" అని హరీష్‌రావు పేర్కొన్నారు.

# సీఎంను దూషించలేదు

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

# ఎవరు పడితే వాళ్లను పార్టీలోకి చేర్చుకోబోం

**కొండా సురేఖ చేరికపై బీజేపీ నేత మురళీధర్ రావు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చుతూ, పార్టీలో చేరికలపై తమకంటూ ఒక స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని ఆయన శనివారం స్పష్టం చేశారు. కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారు" అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయాలపై మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మురళీధర్ రావు చేసిన ఈ వ్యాఖ్యలతో కొండా సురేఖ చేరికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడినట్లయింది.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# 11 రోజుల తర్వాత శిథిలాల కింద ఇద్దరు సజీవం..

**1,344కు పెరిగిన మృతులు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (ఉద్యమ కెరటం):** నేపాల్‌ను తీవ్రంగా కుదిపివేసిన ఆకస్మిక వరదలు, కొండచరియల విపత్తులో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రమాదం సంభవించి 11 రోజులు గడిచినా, శనివారం ఇద్దరిని సజీవంగా కాపాడటం బాధితుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. అపర్ త్రిశూలీ-1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం లోపలి నుంచి ఒక విదేశీయుడిని (చైనా పౌరుడు) రక్షించగా, నువాకోట్ జిల్లా బిదూర్‌లో భవన శిథిలాల కింద చిక్కుకున్న 64 ఏళ్ల చండికా శ్రేష్ట అనే వృద్ధురాలిని నేపాల్ సైన్యం సురక్షితంగా బయటకు తీసింది. బాధితులకు మెరుగైన వైద్యం కోసం హెలికాప్టర్ ద్వారా కాఠ్‌మాండ్ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు వరదల్లో మృతి చెందిన వారి సంఖ్య ఇప్పటివరకు 1,344కు చేరుకోగా, మరో 5 వేల మంది వరకు ఆచూకీ లభించాల్సి ఉంది. మృతదేహాలు తీవ్రంగా దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. అధికారులు డీఎన్ఏ నమూనాలు సేకరించి ఇప్పటివరకు 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేయగా, కేవలం 96 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులకు అప్పగించారు. సైన్యం, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు హెలికాప్టర్లు, తాత్కాలిక వంతెనల సహాయంతో మారుమూల ప్రాంతాల్లోనూ గాలింపు, సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నాయి.



## సంపాదకీయం



# యుద్ధం కాదు.. దౌత్యమే మార్గం!

**ప్రతీకార దాడులతో మరింత రగులుతున్న అమెరికా-ఇరాన్ ఘర్షణ**

**చమురు రవాణా మార్గాలే లక్ష్యాలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు**

**హోర్ముజ్‌లో ఉద్రిక్తత పెరిగితే ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం**

**ఆయుధాలకు విరామమిచ్చి చర్చల బాట పట్టాల్సిన సమయం**

అమెరికా–ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించడం.. ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన క్రూడ్ ఆయిల్ రవాణా నౌకలపై అమెరికా దాడులు చేసినట్లు వార్తలు రావడం.. పరిస్థితి ఎంత వేగంగా అదుపు తప్పుతోందో తెలియజేస్తున్నాయి. ఒకరి దాడికి మరొకరు ప్రతీకారం తీర్చుకునే ధోరణి కొనసాగితే ఇది రెండు దేశాల మధ్య ఘర్షణగానే మిగిలిపోదు. మొత్తం మధ్యప్రాచ్యాన్ని మరో యుద్ధ సుడిగుండంలోకి నెట్టే ప్రమాదముంది. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖార్గ్ ద్వీపం పరిసరాల్లోనూ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలపై పూర్తి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ.. ఇంధన ఉత్పత్తి, రవాణా వ్యవస్థలే ప్రత్యక్ష లక్ష్యాలుగా మారితే దాని ప్రభావం యుద్ధభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశాలపైనా పడుతుంది.

### హోర్ముజ్ రగిలితే.. ప్రపంచానికే సెగ

మధ్యప్రాచ్యంలో జరిగే ప్రతి సైనిక ఘర్షణను ఆ ప్రాంత సమస్యగా మాత్రమే చూడలేం. ప్రపంచ ఇంధన రవాణాలో హోర్ముజ్ జలసంధికి అత్యంత కీలక స్థానం ఉంది. అక్కడ ఉద్రిక్తతలు పెరిగినా, నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఎగిసే అవకాశం ఉంటుంది. చమురు ధర పెరిగితే దాని ప్రభావం పెట్రోలు, డీజిల్‌తో ఆగదు. రవాణా వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి ఖర్చులు అధికమవుతాయి. నిత్యావసర వస్తువుల ధరలపై ఒత్తిడి పడుతుంది. విమానయానం నుంచి పరిశ్రమల వరకు అనేక రంగాలు ప్రభావితమవుతాయి. చివరకు యుద్ధ నిర్ణయాలు తీసుకునేది పాలకులైనా.. వాటి ఆర్థిక మూల్యం చెల్లించేది మాత్రం సామాన్య ప్రజలే.

### ప్రతీకారానికి అంతమెక్కడ?

యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన పదం 'ప్రతీకారం'. ఒక దాడికి మరో దాడి.. దానికి ప్రతిగా ఇంకో దాడి.. ఇలా సాగితే ఎక్కడ ఆగాలన్నది చివరకు ఎవరి చేతుల్లోనూ ఉండదు. మొదట పరిమిత లక్ష్యాలపై ప్రారంభమైన సైనిక చర్యలు క్రమంగా కీలక మౌలిక వసతులు, ఇంధన కేంద్రాలు, నౌకాశ్రయాలు, చివరకు జనావాసాలను కూడా ప్రమాదంలోకి నెట్టవచ్చు. దేశాల భద్రతా ప్రయోజనాలను ఎవరూ తక్కువ చేయలేరు. తమ భూభాగం, ప్రజలు, సైనిక బలగాలను రక్షించుకోవడం ప్రతి దేశానికీ హక్కే. కానీ భద్రత పేరుతో అంతులేని ప్రతీకార చక్రాన్ని కొనసాగించడం సమస్యకు పరిష్కారం కాదు. అది మరింత అస్థిరతకు బాట వేస్తుంది.

### చర్చలకు తలుపులు ఇంకా మూసుకుపోలేదు

ఈ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కూడా దౌత్యానికి అవకాశం పూర్తిగా కనుమరుగైందని భావించాల్సిన అవసరం లేదు. తాత్కాలిక ఒప్పందంలోని కట్టుబాట్లను అమెరికా పాటిస్తే తాము కూడా సహకరిస్తామని ఇరాన్ నాయకత్వం చెబుతుండటం చర్చలకు ఇంకా కొంత స్థలం మిగిలి ఉందనే సంకేతంగా చూడాలి. ఇక్కడే అంతర్జాతీయ సమాజం పాత్ర కీలకం. ఐక్యరాజ్యసమితి సహా ప్రభావవంతమైన దేశాలు కేవలం 'సంయమనం పాటించండి' అనే ప్రకటనలకే పరిమితం కాకూడదు. అమెరికా–ఇరాన్ మధ్య ప్రత్యక్ష లేదా మధ్యవర్తిత్వ చర్చలకు వేదికను సిద్ధం చేయాలి. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన భద్రతా హామీలు, ఇంధన రవాణాకు రక్షణ, పరస్పర దాడుల నిలిపివేత వంటి అంశాలపై తక్షణ చర్చలు జరగాలి.

### గెలిచేది ఎవరు.. ఓడేది ఎవరు?

ప్రపంచం ఇప్పటికే యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు, ఇంధన ధరల ఒత్తిడితో సతమతమవుతోంది. ఈ సమయంలో మధ్యప్రాచ్యంలో మరో దీర్ఘకాలిక యుద్ధం మొదలైతే అది ఏ ఒక్క దేశానికీ మేలు చేయదు. యుద్ధరంగంలో సైనిక విజయం సాధించవచ్చు.. కానీ కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. కూలిపోయిన ఆర్థిక వ్యవస్థలను ఒక్కరోజులో నిలబెట్టలేం. ప్రజల మధ్య పెరిగిన ద్వేషాన్ని ఒక ఒప్పందంతో చెరిపేయలేం. అందుకే అమెరికా, ఇరాన్ రెండూ సంయమనం పాటించాల్సిన సమయం ఇది. క్షిపణికి క్షిపణి.. దాడికి దాడి సమాధానం కాదు. చర్చకు చర్చే సమాధానం. ఆయుధాలు సమస్యను వాయిదా వేయగలవేమో కానీ.. శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వగలిగేది దౌత్యమే. యుద్ధంలో ఎవరు గెలిచారన్నది చరిత్ర రాసుకోవచ్చు.. కానీ ప్రతి యుద్ధంలోనూ ముందుగా ఓడిపోయేది మానవత్వమే!

# శతాబ్దం దాటినా.. విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖి
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ



**ఢిల్లీ, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ.. వందేళ్లుగా విద్యారంగానికి కళాశాల అందిస్తున్న సేవలను ప్రశంసించారు. వ్యాపారం, ప్రజాజీవితం, సామాజిక రంగాల్లో తరతరాల నాయకులను తీర్చిదిద్దడంలో ఈ విద్యాసంస్థ విశిష్టమైన ముద్ర వేసిందని కొనియాడారు. శతాబ్ది ఉత్సవాలకు ముందు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. విద్యా ప్రతిభ, సంస్థాగత నిర్మాణంలో శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. వందేళ్ల ప్రయాణంలో దేశ అభివృద్ధికి అవసరమైన ప్రతిభావంతులను అందించడంలో కళాశాల పాత్రను అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజునే శతాబ్ది ఉత్సవాలు జరగడం ప్రత్యేకతను సంతరించుకుంది. కళాశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ జెన్–జీ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల ఆలోచనలు, ఆకాంక్షలు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. యువత తమ అభిప్రాయాలను ప్రధానితో నేరుగా పంచుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యేందుకు ప్రధాని మోదీ ఢిల్లీ మెట్రోలో ప్రయాణించి కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. మెట్రో ప్రయాణంలో చిన్నారులు, మహిళలు, ఇతర ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రధానితో మాట్లాడేందుకు అవకాశం రావడంతో ప్రయాణికుల్లో ఉత్సాహం కనిపించింది. కామర్స్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ విద్యలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ 1926లో ఆవిర్భవించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత సర్ శ్రీరామ్ చొరవతో ఏర్పాటైన ఈ విద్యాసంస్థ వందేళ్ల ప్రయాణంలో అనేక రంగాలకు ప్రతిభావంతులను అందించింది. పారిశ్రామికవేత్తలు, పరిపాలనాధికారులు, విధాన నిర్ణేతలు, ప్రజాజీవితంలో ప్రముఖులుగా ఎదిగిన అనేక మంది ఈ కళాశాల నుంచి విద్యనభ్యసించారు. శతాబ్ది మైలురాయిని చేరుకున్న శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్.. గత వైభవాన్ని గుర్తుచేసుకుంటూనే కొత్తతరం విద్యార్థులతో మరో శతాబ్దపు ప్రయాణానికి అడుగుపెట్టింది.

# బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన
- దోషుల్లో ముగ్గురు మహిళలు




**జగదల్‌పూర్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** ఛత్తీస్‌గఢ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన 2013 జీరమ్ లోయ మావోయిస్టు దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై జరిగిన ఈ దాడికి సంబంధించిన కేసులో ముగ్గురు మహిళలు సహా మొత్తం 10 మందిని జగదల్‌పూర్ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు దోషులుగా నిర్ధారించింది. ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ సింగ్ రాజ్‌పుత్ తీర్పు వెల్లడించారు. దోషులకు విధించే శిక్షలను సెప్టెంబర్ 16న ప్రకటించనున్నారు. 2013 మే 25న బస్తర్ ప్రాంతంలోని దర్భా పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీరమ్ లోయ వద్ద ఈ దాడి జరిగింది. కాంగ్రెస్ నిర్వహించిన 'పరివర్తన్ ర్యాలీ' ముగించుకుని నాయకులు తిరిగి వెళ్తుండగా మావోయిస్టులు వారి కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నంద్‌కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, మాజీ ప్రతిపక్ష నేత మహేంద్ర కర్మ, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్‌తో పాటు పలువురు భద్రతా సిబ్బంది, పౌరులు ఈ దాడిలో మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా అనంతరం చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటన అప్పట్లో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నాయకత్వానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

### 101 మంది సాక్షుల విచారణ

తొలుత బస్తర్ పోలీసులు కేసు నమోదు చేయగా.. ఘటన తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఎన్ఐఏ 2014 సెప్టెంబర్‌లో జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసింది. విచారణలో భాగంగా 101 మంది సాక్షులను విచారించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన అంశాల పరిశీలనకు రెండు న్యాయ విచారణ కమిషన్లు కూడా ఏర్పాటయ్యాయి. ఏళ్ల తరబడి సాగిన విచారణ అనంతరం తాజాగా 10 మందిని దోషులుగా నిర్ధారిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. వారికి ఎంత మేర శిక్ష విధించాలన్న అంశంపై ఈ నెల 16న న్యాయస్థానం నిర్ణయం ప్రకటించనుంది.

### తీర్పుతో మళ్లీ రాజకీయ వేడి

కోర్టు తీర్పు నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. దర్యాప్తులో అనేక వాస్తవాలు వెలుగులోకి రాలేదని మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ ఆరోపించారు. అప్పటి ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు తగిన భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ ఆరోపణలను మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత రమణ్ సింగ్ తోసిపుచ్చారు. అత్యంత సున్నితమైన జీరమ్ లోయ దాడి అంశాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని ఆయన విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాజకీయ చరిత్రలో చెరగని విషాదంగా మిగిలిన జీరమ్ లోయ దాడి కేసులో 13 ఏళ్ల తర్వాత వెలువడిన ఈ తీర్పు కీలక ఘట్టంగా మారింది. ఇప్పుడు దోషులకు సెప్టెంబర్ 16న కోర్టు ఎలాంటి శిక్షలు విధిస్తుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

# పోలీసులకే సవాల్.. చివరకు కటకటాల్లోకి!

**సీజేపీ నిరసనల ఘటనలో ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్**

**దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు**

**బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య**

**ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్**

**కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూలైలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల సందర్భంగా జరిగిన దాడి వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. నిరసనల్లో పాల్గొన్న నిషు ఆజాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్ స్వతంత్ర భరద్వాజ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం తదుపరి విచారణ కోసం ఒక రోజు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. నిరసనల సమయంలో భరద్వాజ్ తన తండ్రి తలపై ఓ వస్తువుతో దాడి చేశాడని, దాంతో ఆయన గాయపడ్డారని నిషు ఆజాద్ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి భరద్వాజ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఓ నిరసనకారురాలి తండ్రిపై తాను దాడి చేసినట్లు భరద్వాజ్ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. బాధితుడి తలకు తీవ్ర గాయమై పెద్ద సంఖ్యలో కుట్లు పడి ఉండవచ్చని చెప్పాడు. అంతటితో ఆగకుండా.. అలాంటి దాడి హత్యాయత్నం పరిధిలోకి రావచ్చని పేర్కొంటూనే రాజకీయ పలుకుబడి కారణంగా పోలీసులు తనను అరెస్ట్ చేయలేదని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలతో కూడిన వీడియో వైరల్ కావడంతో పోలీసుల తీరుపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. భరద్వాజ్ వ్యాఖ్యలపై స్పందించిన నిషు ఆజాద్ సామాజిక మాధ్యమంలో వీడియో విడుదల చేశారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయడానికి నిరాకరించారని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కోరారు. సామాజిక మాధ్యమాల్లో తనను వేధించడంతో పాటు లైంగిక దాడి బెదిరింపులు కూడా వస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై రాజకీయ నేతలు కూడా స్పందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం సహా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని సంబంధిత నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని పరిశీలించాలని డిమాండ్లు వచ్చాయి. మరోవైపు నిషు ఆజాద్ ఆరోపణలపై పోలీసులు స్పందిస్తూ.. ఘటన సమయంలో బాధితుడికి స్వల్ప గాయాలైనట్లు ప్రాథమికంగా గుర్తించినందున అప్పట్లో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నట్లు సమాచారం. భరద్వాజ్ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలకు భిన్నమైన వాదన వినిపించాడు. ఘటన సమయంలో తనను 10 నుంచి 15 మంది చుట్టుముట్టారని, ఆ పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసమే దాడి చేయాల్సి వచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం పోలీసులు ఇరుపక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లష్కర్ కమాండర్ హతం

**భద్రతా దళాల మెరుపు దాడి**

**బద్గాంలో సంయుక్త ఆపరేషన్**



**శ్రీనగర్, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్ పర్వత ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా దళాలు జరిపిన మెరుపు ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన కీలక పాకిస్థానీ కమాండర్ 'యాసిర్' హతమయ్యాడు. పర్వత ప్రాంతాల్లో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే పక్కా నిఘా సమాచారంతో భారత ఆర్మీకి చెందిన 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ బలగాలు సంయుక్తంగా తనిఖీ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాల రాకను గమనించి ఉగ్రవాది జరిపిన కాల్పులకు తిప్పికొట్టిన బలగాలు యాసిర్‌ను అక్కడికక్కడే మట్టుబెట్టాయి. భద్రతా వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. యాసిర్ గతంలో 2025 పహల్గామ్ దాడి సూత్రధారి, లష్కర్ ప్రసిద్ధ ఉగ్రవాది సులైమాన్ మూసా (హాషిమ్ మూసా) గ్రూప్‌లో కీలక సభ్యుడిగా పనిచేశాడు. ఏడాది క్రితం ఆ గ్రూప్ నుంచి విడిపోయిన యాసిర్, యూస్‌మార్గ్ ఎత్తైన పర్వత రహస్య ప్రాంతాల్లో ఉంటూ ప్రత్యేక ఉగ్ర నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడు. గత కొంతకాలంగా ఇతని కదలికలపై గూఢచారి వర్గాలు నిఘా ఉంచాయి. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర ఘటనలు, ప్లానింగ్‌లలో ఇతని ప్రమేయం ఉందా అన్న కోణంలో విచారణ ముమ్మరం చేశారు. శ్రీనగర్‌లోని దాచీగామ్ అటవీ ప్రాంతంలో సులైమాన్ మూసాను గతంలోనే భద్రతా దళాలు మట్టుబెట్టగా, ఇప్పుడు అతని ప్రధాన అనుచరుడు యాసిర్‌ను కూడా తుదముట్టించడంతో లష్కర్ నెట్‌వర్క్‌కు తీవ్ర విఘాతం కలిగింది.

# చంద్రకాంత్ కు ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ పురస్కారం



**ఉద్యమ కెరటం, సికింద్రాబాద్ :** ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం అబిడ్స్ లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సభలో, బన్సీలాల్ పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న యం.చంద్రకాంత్ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి పురస్కారాన్ని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందించారు.

# అదనపు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కాగజ్ నగర్ సబ్ కలెక్టర్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన హర్మ్ చౌదరి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై చర్చించారు.

# విరాహత్ అలీని పరామర్శించిన పలువురు ప్రముఖులు



**ఉద్యమ కెరటం, బషీర్ బాగ్ :** ఇటీవల మాతృమూర్తిని కోల్పోయిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ ని శనివారం బషీర్ బాగ్ లోని యూనియన్ కార్యాలయంలో పలువురు ప్రముఖులు, నాయకులు పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. విరాహత్ అలీని పరామర్శించిన వారిలో తెలంగాణ రాష్ట్ర లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ చరణ్ కౌశిక్ యాదవ్, గాంధీభవన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కే. హరిప్రసాద్ రావు, సీనియర్ జర్నలిస్ట్స్, అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ కో-చైర్మన్ చారీ ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు విరాహత్ అలీ కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేస్తూ, మాతృవియోగం భరించలేని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వీరితో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా విరాహత్ అలీని కలిసి పరామర్శించారు.

# పెరటిలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలు స్వాధీనం

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని అరటిపల్లి గ్రామంలో ఇంటి పెరటిలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెబ్బెన సీఐ సంజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అరటిపల్లి గ్రామానికి చెందిన మేసినేని చంద్రయ్య ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. పెరటిలో సాగు చేస్తున్న ఏడు గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి సాగు, విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై సుబ్బారావు, తిర్యాణి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు మాత్రమే

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** సమాజంలో విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే శక్తి కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసే కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి లతో కలిసి హాజరై ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యమని తెలిపారు. తన శిష్యుల ఎదుగుదలనే గురుదక్షిణగా భావించే ఒకే ఒక వ్యక్తి ఉపాధ్యాయుడు మాత్రమే అని తెలిపారు. సమాచారం అంతా గుప్పిట్లోకి వచ్చిన ఈ రోజులలో కూడా ప్రత్యేక బోధననే పిల్లలు ఇష్టపడతారని, తరగతి గదిలో విద్యార్థులను నువ్వు సాధించగలవు అని ప్రోత్సహించి ముందుకు నడిపే మార్గదర్శకులు ఉపాధ్యాయులే అని తెలిపారు. గురువు దైవంతో సమానమని, విద్యార్థులు 100 శాతం బడికి వచ్చే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలని, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని తెలిపారు. జిల్లాలో విద్యారంగం బలోపేతం దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం అనేక మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా 38 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ తరఫున జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా మౌలిక వసతుల కల్పన

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** సదరం శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని సందర్శించి దివ్యాంగులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదరం శిబిరంలో దివ్యాంగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు జరగనున్న శిబిరాలకు హాజరయ్యే దివ్యంగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని, జిల్లాలోని అన్ని మండలాల నుండి శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.



# విద్యార్థి జీవితాలతో ఆడుకోవద్దు..

• పెండింగ్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వాల్సిందే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** రాష్ట్రంలోని విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ 12,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని పి డి ఎస్ యు కొమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం జానకపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తయినా ఫీజు బకాయిలు రాక కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం వల్లే విద్యావ్యవస్థలో సమస్యలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరించే జీవో 97ను వెంటనే రద్దు చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యుమండల అధ్యక్షుడు సమీర్, నాయకులు జగజంపుల తరుణ్, శివ శంకర్, బౌరే వసంత్, ప్రణయ్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎలుగుబంటి దాడి బాధితుడికి కార్పొరేట్ వైద్యం అందించాలి

## గిరిజన సంఘం డిమాండ్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఎలుగుబంట్ల దాడిలో గాయపడిన తిర్యాని మండలం నాయకపుగూడకు చెందిన మేకల కాపరి మొడితె శంకర్‌కు, మార్గమధ్యలో అంబులెన్స్ ప్రమాదంలో గాయపడిన ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తక్షణమే కార్పొరేట్ వైద్యం అందించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఆసిఫాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం లింగాల గ్రామంలో అడవిలోకి వెళ్లాడనే నెపంతో ఆత్రం బాపు అనే ఆదివాసీపై భౌతిక దాడికి పాల్పడిన బీట్ ఆఫీసర్ రాజశేఖర్‌ను వెంటనే సస్పెండ్ చేసి, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. గిరిజనులపై అటవీ అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరంగ మాలశ్రీ, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.



# లైసెన్స్డ్ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రాష్ట్రంలో భూ భారతి చట్టంలో భూ సంబంధిత సేవలు అందిస్తున్న లైసెన్స్డ్ సర్వేయర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించాలని ఆదిలాబాద్ లైసెన్స్డ్ సర్వేయర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన శిక్షణ, లైసెన్స్ ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నప్పటికీ సర్వేయర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎకరానికి 20 రూ. నుంచి రూ.50 పారితోషికం పెంచడం, అలాగే నెలకు 500 ఎకరాల అవుట్‌పుట్ వంటి నిబంధనలు అమలు చేశారని, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు ఈ నిబంధనలు ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థలో సేవలు అందిస్తున్న లైసెన్స్డ్ సర్వేయర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్క్యులర్‌లోని ఎకరాల అవుట్‌పుట్, పారితోషిక నిబంధనలను క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. లైసెన్స్ రద్దు చేసే ముందు సంబంధిత సర్వేయర్‌కు నోటీసు ఇచ్చి వివరణకు అవకాశం కల్పించాలని, సర్వేయర్లు, వారి కుటుంబాలకు ఆరోగ్య బీమా, విధి నిర్వహణలో ప్రమాదం జరిగినప్పుడు తక్షణ వైద్య, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్స్డ్ సర్వేయర్లకు సంబంధించిన అన్ని పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# గార్డెనింగ్ శిక్షణతో యువతకు ఉపాధి అవకాశాలు

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** గార్డెనింగ్, నర్సరీ నిర్వహణలో శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని జల్‌జీవిక ఆక్వా లైవ్లీహుడ్ సంస్థ డైరెక్టర్ బి.పద్మాకర్ అన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 45 రోజుల 'నర్సరీ అండ్ గార్డెనింగ్' సర్టిఫికేట్ కోర్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యార్థులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకం, ఉద్యానవన నిర్వహణ వంటి నైపుణ్యాలు ప్రస్తుత కాలంలో ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధిని పొందవచ్చని పేర్కొన్నారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు జీవనోపాధిని కూడా అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక, ఉపాధి ఆధారిత నైపుణ్యాలను అందించడమే ఇలాంటి సర్టిఫికేట్ కోర్సుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కోర్సులో నేర్చుకున్న నైపుణ్యాలను విద్యార్థులు తమ ఇళ్లలో, కళాశాల ప్రాంగణంలో, సమాజంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. 45 రోజుల శిక్షణలో నర్సరీ నిర్వహణ, విత్తనాలు విత్తడం, మొక్కల అంకురోత్పత్తి, కట్టింగ్స్, లేయరింగ్, గ్రాఫ్టింగ్, తోటల రూపకల్పన, కంపోస్ట్, వర్మీకంపోస్ట్ తయారీ, సేంద్రియ పద్ధతుల్లో తెగుళ్ల నియంత్రణ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మీ నరసింహం, కోర్సు కోఆర్డినేటర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి దేవేందర్ వీరమల్ల, డి.జనార్ధన్, ఎం.రాజేశ్వర్, దత్తాత్రేయ, సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం

- ఎమ్మెల్సీ దండే విట్టల్
- ఆసిఫాబాద్‌లో 1000 రోజుల ప్రజాపాలన వేడుకలు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పిలుపు మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా వాతావరణంలో సాగింది. అనంతరం నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, పేదలు మరియు గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వెనుకబడిన రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలను అమలు చేసి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

### ఆరు గ్యారెంటీలతో ప్రజలకు సంక్షేమ ఫలాలు: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌పై ఉంచిన విశ్వాసానికి ఈ 1000 రోజుల ప్రజాపాలనే నిదర్శనమన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, పంట రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించడం వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఎలాంటి వివక్ష లేకుండా పథకాలు అందిస్తున్నామని, కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల అవినీతికి భిన్నంగా రైతులకు నిజమైన ప్రయోజనం చేకూర్చే సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, డైరెక్టర్ రాంచందర్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, టౌన్ అధ్యక్షుడు ఇమ్రాన్ హస్మి, డీసీసీ ఉపాధ్యక్షులు తరిఖ్, భీమ్ రావ్, జిల్లా కార్యదర్శి శోభన్, రాజీవ్‌గాంధీ పంచాయితీ రాజ్ సంఘటన్ జిల్లా కో-ఆర్డినేటర్ కోవా ఇందిరా, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా , యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కమల్ నాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా కుప్పి ఘాట్

- ఆందోళన చెందుతున్న వాహనదారులు
- బ్రిడ్జి మరమ్మతులే శాపంగా.. ఒకే వైపు రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు





**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఆదిలాబాద్- నిర్మల్ జాతీయ రహదారిపై నేరడిగొండ మండలంలోని కుప్టి ఘాట్ ప్రమాదాలకు నిలయంగా మారింది. పాత బ్రిడ్జి మరమ్మతుల కారణంగా రహదారిపై వాహనాల రాకపో కలను ఒకేవైపు నుంచి కొనసాగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు భయాం దోళనకు గురవుతున్నారు.

### శుక్రవారం మరో ప్రమాదం..

కుట్టి ఘాట్ వద్ద శుక్రవారం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. నిర్మల్ నుంచి టమాటా లోడ్ తో ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ట్యాంకర్ ఎదురుగా వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 ద్వారా ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గత వారం రోజుల్లో ఇది మూడో ప్రమాదం కావడం గమనార్హం.

### ట్రాఫిక్ జామ్ తో అవస్థలు..

ఒకే వైపు నుంచి వాహనాల రాకపోకలు సాగుతుం డటంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. భారీ లారీలు, ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా రావడంతో ఎవరు ముందు వెళ్లాలో తెలియక గంటల తరబడి వాహనాలు నిలి చిపోతున్నాయి. సరైన సూచిక బోర్డులు, ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బస్టాండ్ లేక గ్రామస్తుల అవస్థలు..

ఇదిలా ఉండగా కుప్టి బస్టాండ్ సమీపంలో బస్సులు నిల పకపోవడంతో కుప్టి, కుమారి, గాజిలి, గాంధారి, తర్నం(కె), కౌట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఘాట్ వద్ద బస్సులు ఆపడం లేదని, దీంతో కిలో మీటర్ల దూరం నడవాల్సి వస్తోందని మహిళలు, వృద్ధులు వాపోతున్నారు. బస్సులు సైతం సమయానికి రాక పోవడంతో విద్యార్థులు ఆలస్యంగా పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కుప్టి ఘాట్ రహదారి మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాల నివారణకు తాత్కాలికంగా ట్రాఫిక్ పోలీసులను నియమిం చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# గురువుల సేవలు సమాజానికి మార్గదర్శకం

- తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

**ఉద్యమ కెరటం, తాండూర్:** గురువుల సేవలు సమాజానికి మార్గదర్శకమని తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాండూర్ ఎంఈఓ డి.శ్రీ నివాస్‌తో పాటు ఉపాధ్యాయులు జె.భాగ్య, ఎం.స్వప్న, వై.పద్మజ, ఎస్.మౌనిక, లింగయ్య, అశోక్, ఎం.రమేష్, సిహెచ్. రామన్నలను క్లబ్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరు పుకుంటున్నామని తెలిపారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగును అందించేది గురువులేనని అన్నారు. విద్యార్థుల తప్పులను సరిదిద్దుతూ, నూతన విషయాలను బోధిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న గురువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి తాటిపాముల సాంబమూర్తి,



రీజియన్ చైర్‌పర్సన్ బాపు రెడ్డి, జెడ్‌సీ రౌతు వెంకటేశం, మాజీ అధ్యక్షులు సిరంగి శంకర్, దేవరకొండ రాజయ్య, ఉపాధ్యక్షుడు మద్దికుంట రామచందర్‌తో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# పాఠశాల నుంచి రూ.50వేలు డిమాండ్

### బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పేద విద్యార్థుల సహాయం పేరుతో విరాళాలు సేకరించి, అనంతరం భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ ఎంజేపీ బాలుర పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ ఎంజేపీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ నందా సింగ్ ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు కోతూరి ప్రవీణ్ అలియాస్ కొట్టూరు ప్రవీణ్, టీజీవీపీ విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్నట్లు తెలిపారు. నిందితుడు గతంలో పేద విద్యార్థుల సంక్షేమం కోసం విరాళాలు కావాలని పాఠశాలను సందర్శించేవాడు. ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు విరాళాలు అందించారు. అనంతరం మరోసారి పాఠశాలకు వచ్చిన నిందితుడు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇచ్చేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిరాకరించడంతో పాఠశాల, ఉపాధ్యాయులపై సోషల్ మీడియాలో తప్పుడు, పరువు నష్టం కలిగించే వార్తలు ప్రచారం చేస్తానని బెదిరించాడు. అంతేకాకుండా ప్రిన్సిపాల్ ను బెదిరిస్తూ ఉద్యోగం కోల్పోయేలా చేస్తానని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ ఇన్స్‌పెక్టర్ కె.నరేష్ కుమార్ మాట్లాడుతూ బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, డబ్బుల కోసం ఒత్తిడి చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# శ్రీ లీలామృత గ్రంథ పారాయణం ముగింపు

- ఘనంగా శోభాయాత్ర.. ఉత్సాహంగా దహీ హండి

**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** జగద్గురు శ్రీమద్ రామానం దాచార్య నరేంద్రచార్య సంస్థానం అంతర్గత తెలంగాణ ఉపపీఠం, కామారెడ్డి జిల్లా డోంగ్లీ సంత సంఘ సేవా కేంద్రం ఆధ్వర్యంలో 21 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ లీలామృత గ్రంథ పారాయణ కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. జగద్గురు శ్రీ రచించిన పవిత్ర శ్రీ లీలామృత గ్రంథాన్ని భక్తులు 21 రోజుల పాటు భక్తిశ్ర ద్ధలతో పారాయణం చేశారు. గ్రంథ సమాప్తి సందర్భంగా డోంగ్లీ గ్రామంలో జగద్గురు శ్రీ నామస్మరణ, భజనలతో ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. భక్తుల నినాదాలు, భజనలతో గ్రామ వీధులు మార్మోగాయి. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని గ్రామంలోని శ్రీ హనుమాన్ మందిరం వద్ద దహీ హండి కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దహీ హండిని పగలగొట్టి సంబరాలు



చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉపపీఠం సభ్యులు, కామారెడ్డి జిల్లా పదాధికారులు, డోంగ్లీ గ్రామ కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మండలంలోని శాంతాపూర్ (ఉమ్రి) గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్జున్ మహారాజ్ శాస్త్రీ ఆధ్వర్యంలో రెండో రోజు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్ర మానికి తెలంగాణ రక్షణ సేన స్టేట్ అబ్జర్వర్, టీఆర్ఎస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపి భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం భక్తి, ధర్మం, సత్యం, మానవతా విలువలను చాటిచెప్పే పవిత్రమైన పండుగ అని అన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని, గీతా సారాన్ని ప్రతిఒక్కరు జీవితంలో పాటించాలన్నారు. గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అర్జున్ మహారాజ్ శాస్త్రీ, నిర్వాహకులు, గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని బెల్లంపల్లి ఉద్యాన శాఖ అధికారిణి అర్చన అన్నారు. మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో శనివారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ ద్వారా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయల సాగులో ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థి తులను ఎదుర్కొనేందుకు మల్చింగ్, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక పద్ధతులను పాటించాలని సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి కె.సుష్మా మాట్లాడుతూ కూరగాయల సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా వివిధ రకాల సబ్సిడీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైతులకు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పంటకు అవసరమైన మేరకు ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్, ఎంబడి శ్వేతారాణి, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, మాట్రిక్స్ ఎఫ్ఈ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి అందరి సహకారం అవసరం

### ఎంపీయూపీఎస్ వంజిరి విద్యార్థులకు 106 జతల షూస్ పంపిణీ



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** విద్యార్థుల సంక్షేమానికి అందరి సహకారం అవస రమని గ్రామ సర్పంచ్ లక్ష్మి గోపాల్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంపీయూపీఎస్ వంజిరి పాఠశాల విద్యార్థులకు 106 జతల షూస్‌ను పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహక రించాలని పేర్కొన్నారు. షూస్ అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి శ్వేతారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గంభీ రావుపేట మండలం నర్మాల గ్రామంలోని ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యార్థిని దాసరి నిహారిక, ఆమె తండ్రి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత దాసరి చంద్రం కలిసి ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి చంద్రం మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణే ధ్యేయం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ తండాలో టీబీ రహిత గిరిజన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమగ్ర ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సమగ్ర ఆరోగ్య పరీక్షా శిబిర ప్రచార వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రోగులకు నిక్షయ్ మిత్ర కిట్లను పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ సరస్వతిని అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా పిరమల్ ఫౌండేషన్ సహకారంతో ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్ మండలాల్లోని మూడు బ్లాకుల్లో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్తులో జిల్లాలోని మిగతా బ్లాకులకు కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక ఆరోగ్య శిబిరాల్లో అన్నిరకాల స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ గ్రామాల్లోనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ వ్యాధికి ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని, ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆదిలాబాద్ను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం హర్కాపూర్ తండాలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులతో కలిసి సాంప్రదాయ నృత్యం చేస్తూ స్థానికులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, అదనపు డీఎంహెచ్ఓ మనోహర్, డీఆర్డీఓ రవీందర్, ప్రోగ్రామ్ అధికారి సుమలత, సర్పంచ్ రోహిదాస్, పిరమల్, స్టాప్ టీబీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు, గ్రామస్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తి.. కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపూరావుతో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యువకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు హామీలను అమలు చేసిందన్నారు. రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో చేసి చూపించిందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, లైబ్రరీ చైర్మన్ మల్లెపుల నర్సయ్య, బోథ్ మార్కెట్ చైర్మన్ మల్లెపుల సత్య నారాయణ, ఆత్మ చైర్మన్ సంతోష్ రావు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# కూల్‌డ్రింక్ షాపులో చోరీకి యత్నం

**రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న స్థానికులు**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం బుగ్గపాడు, గాంధీనగర్ శివారులో కూల్‌డ్రింక్ షాపులో చోరీకి యత్నించిన ఇద్దరు వ్యక్తులను స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బుధవారం అర్ధరాత్రి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు షాపు ఎదురుగా ఉన్న లైట్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశం చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. షాపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చోరీ యత్నానికి సంబంధించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై ఇద్దరినీ చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న



పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుల వద్ద నుంచి చోరీకి ఉపయోగించినట్లు భావిస్తున్న బైక్, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ప్రాథమిక విచారణలో నిందితులు సత్తుపల్లికి చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. ఇదే ప్రాంతంలోని మరో కూల్‌డ్రింక్ షాపులో ఇటీవల జరిగిన చోరీలోనూ తమ ప్రమేయం ఉన్నట్లు వారు స్థానికుల ఎదుట అంగీకరించినట్లు తెలిసింది. అయితే ఈ వరుస చోరీల వెనుక వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. వరుస చోరీలతో వ్యాపారులు, స్థానికుల్లో ఆందోళన నెలకొంది. చోరీలకు పాల్పడుతున్న వారిని, వారికి సహకరిస్తున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

# ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రీచ్‌ల ఏర్పాటు

- **డీఎల్ఎస్సీ సమావేశంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** ప్రభుత్వ అభివృద్ధి పనులు, నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా జిల్లాలో గుర్తించిన నూతన ఇసుక రీచ్‌లపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు సంబంధించి మైనింగ్, నీటిపారుదల, భూగర్భ జలాలు, రెవెన్యూ, జిల్లా పంచాయతీ, మిషన్ భగీరథ, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు పలు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ పరిశీలనపై శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ (డీఎల్ఎస్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనులు, నిర్మాణాలు, వాణిజ్య అవసరాల కోసం నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. నూతన రీచ్‌ల ఎంపిక, ఏర్పాటు విషయంలో ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక రీచ్‌ల పరిశీలనలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇసుక రీచ్‌ల నిర్వహణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఎండీసీ పీఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతికుమార్, నీటిపారుదల శాఖ అధికారులు ప్రశాంత్,



కిషోర్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహశీల్దార్లు మహేష్, మురళి, భూగర్భ జల శాఖ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మార్లవాయిని సందర్శించిన హైమన్డార్ఫ్ ఆత్మీయులు

- **హైమన్డార్ఫ్–బెట్టీ ఎలిజబెత్ విగ్రహాలకు నివాళులు**

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని మార్లవాయి గ్రామాన్ని రామ్ కిషన్, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ పి.నిరూప్, ఆదివాసీ చెంచు మిత్రులు గురువయ్య, రవి తదితరులు శనివారం సందర్శించారు. గ్రామానికి చేరుకున్న వారికి సర్పంచ్ కనక ప్రతిభ, గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ప్రొఫెసర్ హైమన్డార్ఫ్, బెట్టీ ఎలిజబెత్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైమన్డార్ఫ్ మ్యూజియాన్ని సందర్శించి ఆదివాసీ సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం శృతివనాన్ని సందర్శించి సమాధులకు నివాళులు అర్పించారు. మార్లవాయి గ్రామం గతంతో పోలిస్తే ప్రస్తుతం అభివృద్ధి చెందడం సంతోషంగా



ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ సమాజానికి హైమన్డార్ఫ్ చేసిన సేవలను తరతరాలకు గుర్తుచేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించడంతో పాటు చిరుధాన్యాలు, సాంప్రదాయ పంటలను కాపాడి భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో



ఉప సర్పంచ్ ఆత్రం రాజేశ్వర్, పటేల్ ఆత్రం భగవంతురావు, మాజీ సర్పంచ్ దేవరీ కనకకొద్దు, వార్డు సభ్యులు కొడప పుల్లబాయి, సోయాం రాజు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు అశోక్, కనక వెంకటేశ్వరరావు, సార్ మేడి, గేడం గణపత్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామసభలో అభివృద్ధి పనులపై సమీక్ష



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని మాదారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో విబిజి రామ్‌జీ పనులపై శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధిహామీ కూలీలు, గ్రామస్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టనున్న ఉపాధిహామీ పనులపై చర్చించారు. కుంటల పనులు, ట్రెంచ్‌లు, ఇంకుడు గుంతలు, ఫారం పాండ్లు, పండ్ల తోటల పెంపకం తదితర పనులను చేపట్టే అంశాలపై సమావేశంలో చర్చించారు. గ్రామస్థుల అభిప్రాయాలు, అనుమతులతో రాబోయే గ్రామసభలో పనులకు సంబంధించి తీర్మానం చేయనున్నట్లు టీఈ ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామసభకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లు మీన, యాదలక్ష్మిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు బానేష్, లక్ష్మీ, లలిత, రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఉపాధిహామీ సిబ్బంది ప్రసాద్, విజయ్, మేట్ పుష్ప, గ్రామ ప్రజలు, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** సిర్పూర్(యు) గ్రామంలోని పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆత్రం దత్తు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయుల బోధనలు, సూచనలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

## కేరళ గ్రామర్ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** కేరళ గ్రామర్ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను రంగురంగుల బెలూన్లు, అలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల పట్ల తమకున్న గౌరవం, అభిమానాన్ని ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చాటుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అఖీల్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, మంచి నడవడికను నేర్పించడం ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ పకడ్బందీగా పూర్తి చేయాలి

- 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా శనివారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో బీఎల్ఏలతో నిర్వహించిన సమావేశానికి హాజరై ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లు ఎంతమంది ఉన్నారు, కొత్త ఓటర్లుగా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారనే వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. మండలం పరిధిలో 1,217 మంది నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా సంబంధిత ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తహశీల్దార్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు అన్ని గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. ఈనెల 6న, 12న, 13న ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు అధికారులు ఈఆర్ఓ, ఏఈఆర్ఓ కార్యాలయాల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలతో పాటు ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు. అనంతరం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకుని చదవాలని పేర్కొన్నారు. ప్రతిరోజూ తరగతులకు హాజరై ప్రతి పాఠ్యాంశాన్ని శ్రద్ధగా చదవాలని తెలిపారు. విద్యార్థుల జీవితంలో పదో తరగతి కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, తహశీల్దార్ అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ ఫామ్హౌస్కే పరిమితం

- తెలంగాణలో నడుస్తోంది ప్రజా సింహాసనం
- జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం ఆదిలాబాద్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్, మాజీ ఎంపీ సోయం బాపురావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వందలాది బైక్లపై కాంగ్రెస్ జెండాలు చేతబూని వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనడంతో పట్టణ వీధులు కాంగ్రెస్ నినాదాలతో మార్మోగాయి. కార్యకర్తల్లో ఉత్సాహం, జోష్ కనిపించింది. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని విమర్శించారు. ప్రజల తిరుగుబాటుకు భయపడే మాజీ సీఎం కేసీఆర్ ప్రజాక్షేత్రాన్ని వీడి ఫామ్హౌస్కే పరిమితమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి గుండెకాయ అని పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా, అర్ధరాత్రి అయినా ముందుండి సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యకర్తల రక్తం, చెమటతోనే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, తమది ముమ్మాటికీ రైతు ప్రభుత్వమేనని అన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ టీపీసీసీ అధ్యక్షురాలు గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు



సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కోటేశ్ అన్న, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొర్ల రాజు యాదవ్, కొడల నారాయణ, గిమ్మా సంతోష్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను



అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు, నూతన కమిటీ సభ్యులు, గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బద్దం పోతారెడ్డి జన్మదిన వేడుకలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి జన్మదిన వేడుకలు ఆదిలాబాద్ పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేయించారు. అనంతరం పోతారెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బద్దం పోతారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. యువతను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్ బ్లాక్ ఆత్మ కమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్, గొర్ల రాజు యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ తదితరులు బద్దం పోతారెడ్డిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు కుర్మ మహేందర్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్



శ్రీకర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ రషీద్, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు

- డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మండల విద్యా శాఖ అధికారి కార్యాలయంలోని రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మెయిన్ రోడ్డులోని రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత సెంటర్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, నైతికతను బోధిస్తూ భావితరాల నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. రాధాకృష్ణన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వార్డు కౌన్సిలర్లు, మండల విద్యాశాఖ అధికారి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్లో టీచర్స్ డే



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మంలోని శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ పాఠశాలలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల చైర్పర్సన్ నిష్ఠాశర్మ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతుల్లో పాఠ్యాంశాలను బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సోహిత్, ఆసియా ఫిర్దోస్, హర్షితలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాల ప్రయోజనాలను అర్హులైన తల్లులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని రాజీవ్నగర్ గ్రామ సర్పంచ్ మామిడాల లలిత రాజేశం సూచించారు. శనివారం రాజీవ్నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో సుపోషణ కార్యక్రమాన్ని సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతిఒక్కరూ పొందాలని సూచించారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, వార్డు సభ్యులు అయిల్ల రాజ్కుమార్, ఎల్దండి కవిత, రౌతు భారతి, చప్యాల నిరంజన్రావు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అంగన్వాడీ టీచర్, ఆయా, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# 460 గంజాయి మొక్కలు స్వాధీనం.. నలుగురు అరెస్ట్

## బుర్నూర్, గుట్టగూడ శివారుల్లో పోలీసుల మెరుపుదాడి



**ఉద్యమ కెరటం, జైనూర్:** సిర్పూర్(యు) పోలీస్ స్టేషన్ పరిధిలోని బుర్నూర్, గుట్టగూడ గ్రామాల శివారుల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి పంటపై పోలీసులు శనివారం మెరుపుదాడి చేశారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మూడు వేర్వేరు కేసులకు సంబంధించి 460 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, సాగుకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్పీ అశోక్, జైనూర్ సీఐ రమేష్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిసి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బుర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జీర్లఘాట్, గుట్టగూడ గ్రామాల శివారుల్లో వ్యవసాయ భూములను పరిశీలించగా, అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని సాగుదారులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన వారిలో జీర్లఘాట్కు చెందిన గెడం లోబాజీ, గెడం జయవంత్, కుమ్రా మాధవరావు, గుట్టగూడకు చెందిన పెందోర్ సూర్యబాను ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు తమ వ్యవసాయ భూముల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు, ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడినా, అక్రమ కార్యకలాపాలకు సహకరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి సాగు లేదా మత్తు పదార్థాల అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో ప్రత్యేక నిఘా, తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ వివరించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ఖాకీల 'మెరుపు' దాడి

## సిర్పూర్ (యు)లో అక్రమ గంజాయి తోటలు ధ్వంసం..

## నలుగురు అరెస్ట్, 460 మొక్కలు జప్తు



**ఉద్యమ కెరటం, సిర్పూర్ (యు):** మండల పరిధిలోని బుర్నూర్ గ్రామ పంచాయతీ జీర్లఘూట్, గుట్టగూడ గ్రామ శివారులలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి తోటలపై పోలీసులు శనివారం ఆకస్మిక దాడి చేశారు. అందిన విశ్వసనీయ సమాచారంతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు పోలీసులు నిర్వహించిన ఈ 'మెరుపు' తనిఖీల్లో దాదాపు 460 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ సాగుపై మూడు వేర్వేరు కేసులు నమోదు చేసిన పోలీసులు, పంట చేనుల్లోనే గంజాయి పెంచుతున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం నిందితులు తమ సొంత వ్యవసాయ భూముల్లో సాధారణ పంటల నడుమ ఎవరికీ అనుమానం రాకుండా ఈ గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు తోటలను ధ్వంసం చేసి, మొక్కలను జప్తు చేశారు. జీర్లఘూట్ కు చెందిన గెడం లోబాజీ, గెడం జయవంత్, కుమ్రా మాధవరావు, గుట్టగూడ గ్రామానికి చెందిన పెందోర్ సూర్యబాను నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### గంజాయి రహిత జిల్లాగా మార్చడమే మా లక్ష్యం : ఎస్పీ నితికా పంత్

జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు లేదా ఇతర మత్తు పదార్థాల దందాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి సాగు లేదా రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతాం.





# పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి ● అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో రూపుదిద్దుకోనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై, మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, ఏఎంసీ చైర్మన్ మంగ, వైస్ చైర్మన్ ఎం.డి. అహ్మద్ , సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ , కౌన్సిలర్లు , టిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఈ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆసిఫాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న రోడ్లు, మురుగునీటి డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి ఎద్దడి వంటి ప్రాథమిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమానికి, పట్టణ సౌందర్యీకరణకు అవసరమైన నిధులను సమీకరించి, రాబోయే రోజుల్లో ఆసిఫాబాద్‌ను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

### ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందిస్తాం : మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్

మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

### పట్టణాభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం నిరంతరం శ్రమిస్తుంది : వైస్ చైర్మన్ అహ్మద్

పట్టణ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వార్డుల వారీగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకవర్గం ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు.

### సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం : సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కొవ లక్ష్మి సహకారంతో మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తుందని సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్ అన్నారు. పట్టణంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, సలాం బీన్ అహ్మద్, బాలకృష్ణ, దూడల లక్ష్మి, నాగు బాయి, జేబా షేక్, బిఆర్ఎస్ నాయకురాలు మరుసుకోల సరస్వతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంధం శ్రీను, సీనియర్ నాయకుడు సయ్యద్ అన్సార్, టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు నిస్సార్, అమర్ బీన్ అహ్మద్, కాశీం, సమద్, ఎత్తేశాం, గుండా శ్యామ్, పొన్నాల నారాయణ, దూడల అశోక్, జయరాజ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం!

**చెన్నై, సెప్టెంబర్ 5 (ఉద్యమ కెరటం):** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరు కోసం తాము అన్ని విధాలా సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడించాడు. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే ఈ కీలక ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన తిలక్ వర్మ.. తమ జట్టు తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. అయితే దేవదత్ పడిక్కల్, మహమ్మద్ సిరాజ్‌లు బరిలోకి దిగుతున్నట్లు తెలిపాడు. "షమీ వేసే లైన్ అండ్ లెంగ్త్ బౌలింగ్‌ను తీవ్రంగా గమనించాం, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని మా సత్తా చాటుతాం" అని తిలక్ అన్నాడు. కాగా, ఏకంగా 54 సంవత్సరాల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ ముఖాముఖి తలపడుతున్నాయి. చివరిసారిగా 1970-71 సీజన్‌లో బ్రాబోర్న్ స్టేడియంలో తలపడగా, ఆ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొత్తం మీద సౌత్ జోన్ ఫైనల్ చేరడం ఇది 24వ సారి కాగా, ఇప్పటివరకు 13 టైటిళ్లు గెలుచుకుంది. మరోవైపు 13 ఏళ్ల విరామం తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్, ఇప్పటివరకు 8 సార్లు ఫైనల్స్ ఆడి 2 సార్లు మాత్రమే విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నారు. అతని పదవీకాలం అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియాతో సమావేశం జరగనుంది. అలాగే రాబోయే ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లుగా మయాంక్ యాదవ్, కార్తీక్ త్యాగి, మొహ్సిన్ ఖాన్‌లకు అవకాశం లభించనుంది.



# యూత్ డిక్లరేషన్ హామీలు ఏమాయె?

- జాబ్ క్యాలెండర్ ఏది..?
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి


**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరుతో గొప్పలు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువతను తీవ్రంగా వంచించిందని, ఉద్యోగాల పేరుతో నోటిఫికేషన్లు లేకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కొవ లక్ష్మి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం యువత, విద్యార్థుల హక్కుల పరిరక్షణకై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు కాలేజీలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని, పక్కాగా జాబ్ క్యాలెండర్ ప్రకటించడంతో పాటు యూత్ డిక్లరేషన్ ఇచ్చిన ప్రతి హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యువత హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం



చేసిన ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, సలాం బీన్ అహ్మద్, బాలకృష్ణ, రాజంపేట సర్పంచ్ పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు మరుసుకోల సరస్వతి, టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు గంధం శ్రీనివాస్, సయ్యద్ అన్సార్, నిస్సార్ , గుండా శ్యామ్, సాయి శ్రవణ్, రాజు కుమార్, పొన్నాల నారాయణ, దూడల అశోక్, జయరాజ్, భీం భాయి, ఉమా తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
6 సెప్టెంబర్ 2026



# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహరాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది.ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్




'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.

# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.





# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంఎస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్- తమన్నాల కెమిస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చొని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.

Printed, Published and Owned by MOHAMMAD ABDUL RAHEMAN, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273 Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717